# అవధూత లీల

## అధ్యాయము - 23

## నమ్మినవారికి సొమ్ము - నమ్మకుంటే .........

108 

**భగవంతుడనుగ్రహించినా విశ్వాసం లేని వారేమీ పొందలేరు. భగవంతుని మాటగానీ, సద్గురుని మాటగానీ సంపూర్ణంగా విశ్వసించి వారు చెప్పినట్లు తు-చ తప్పకుండా ఆచరించిన వారికి మాత్రమే వారి కృప లభిస్తుంది. వారు చెప్పినట్లు ఆచరించలేని వారికి కృప అడవిగాచిన వెన్నెల వంటిది.**

ఇంతవరకూ శ్రీస్వామివారు చెప్పిన వాటిని విశ్వసించి సఫలులైన వారి అనుభవాలు చూచాము. అలాగాక శంకించిన వారి అనుభవం ఏమిటో చూద్దాం.

గొడ్డటి శేషయ్య (గొలగమూడి) గారికి ఆరోగ్యం బాగుండక శ్రీస్వామివారు నయం చేస్తారని వచ్చి ఆయనతో చెప్పుకున్నాడు. శ్రీస్వామివారు "గుంట కలగరాకు వ్రేళ్ళపై నున్న తాట నూరి మూడు పూటలా మ్రింగు" అన్నారు. వారు అలాగే తాట నూరి ఉండలు చేసి మ్రింగబోతూ "దీనికి తగ్గుతుందా?" అని శంకిస్తూ మ్రింగాడు. తెల్లవారి ఆయన శ్రీస్వామివారి దగ్గరకు రాగానే ఏమీ చెప్పుకోకముందే "అయ్యా, దానికి తగ్గదు గాని ఒక మనిషి వస్తాడు. ఆయన దగ్గర మందు తీసుకో" అని చెప్పారు. ఆయన మనసులో ఉదయించిన శంక శ్రీస్వామివారికి తెలియకపోతే గదా!

వి. రామమూర్తి (నెల్లూరు) గారి అన్న కుమారునికి వరుసగా ముగ్గురు ఆడపిల్లలు కలిగారు. నాల్గవ కాన్పుకు ముందు శ్రీస్వామివారి వద్దకొచ్చి మగపిల్లవాడు పుట్టేటట్టు అనుగ్రహించమని ప్రార్థించారు. "అర్ధరాత్రి వేళ ఏ దేవస్థానములోనైనా రోజుకు మూడు ప్రదక్షిణలు చొప్పున మూడు రోజులు చేస్తే మగసంతతి కల్గుతుంది" అని శ్రీస్వామివారు సెలవిచ్చారు. " అర్ధరాత్రివేళ ప్రదక్షిణలు చేయడం కష్టమని, అందులోనూ నవమాసాలు నిండినవిగదా?

ఇప్పుడు ప్రదక్షిణలు చేస్తే బిడ్డ ఎలా మార్పుచెందుతుంది?” అని వారు **అశ్రద్ధ చేసి ప్రదక్షిణలు చేయలేదు. నాల్గవ కాన్పులో గూడా ఆడపిల్ల జన్మించింది.** **109**
**శ్రద్ధలేని వారికి దైవం కరుణించినా ప్రయోజనం లేదుగదా!**

ఇందుకూరుపేటకు చెందిన ఆత్మకూరు వెంకయ్య ఇలా చెప్పారు.

**ఒకప్పుడు 'అయ్యా! ఎద్దుకు బండి గండముంది. అమ్మెయ్యండి' అన్నారు శ్రీస్వామివారు. అమ్మాలనుకున్నా వెంటనే తగిన బేరం రాక పోయేసరికి కాలయాపన జరిగింది. ఒకనాడు రాత్రిపూట ఆ ఎద్దు బండి చక్రానికున్న ఆకుల సందున తలదూర్చి, రుద్దుకొనటానికి ప్రయత్నించింది.** **110**
**దాని కొమ్ములు అడ్డం తగిలి తల ఆకుల సందునుండి రాలేదు. తెల్లవార్లూ తల తప్పించుకునే ప్రయత్నంలో గుంజులాడి తెల్లవారేసరికి చచ్చిపడిపోయింది. (ముందు నిర్ణయం తెలుసుకో)**

రాపూరు తాలూకా పెనబర్తి గ్రామస్తులు శ్రీ రాములు శెట్టిగారికి కుష్టువ్యాధి. కాళ్ళు చేతులు వాపు, పొడ, కాలిబొటిన వ్రేలికి పుండు. ఆయన శ్రీస్వామివారినాశ్రయించాడు. శ్రీస్వామివారు ఆయన వంటికి నూనె రుద్దేవారు. శెట్టిగారింటికి వెళ్ళి అప్పుడప్పుడు శ్రీస్వామివారు ఆతిథ్యము స్వీకరించేవారు. శ్రీస్వామివారు ఎక్కడున్నా శెట్టిగారు వచ్చి దర్శించేవారు. కొన్నాళ్ళకు ఆయన వ్యాధి నివారణైంది. **కానీ ఆయన శ్రీస్వామివారు చెప్పిన స్త్రీ పథ్యము, నియమాలు పాటించలేదు. కనుక అతనికి మరలా** **111**
**ఆ వ్యాధి సంక్రమించింది. (శ్రీస్వామివారివలె జబ్బు నయం చేయలేము. వారిని చూచి అసహనముతో కసిరి కొట్టకుండా భిక్ష ఇచ్చినా సేవే)**

ఒకప్పుడు వేలూరు సుబ్రహ్మణ్యం శ్రీస్వామివారితో తిరువళ్ళూరు వెళ్ళాడు. శ్రీస్వామివారొకచోట నిలుచుని కొండరాళ్ళను తడిమి పరీక్షిస్తున్నారు. కొంతసేపటికి ఒక చిన్నపుల్లతో నేలమీదనున్న ఒక రూపాయి బిళ్ళను ప్రక్కకు తోస్తూ సుబ్రహ్మణ్యాన్ని పిలిచారు. “దీనితో కర్పూరం కొని శ్రీస్వామివారికి వెలిగించు” అని రూపాయిని చూపారు. శ్రీస్వామివారెప్పుడూ తమ చెంత డబ్బు ఉంచుకొనేవారు కాదు. కాని ఆ రూపాయి అక్కడకెలా వచ్చిందో సుబ్రహ్మణ్యంకు తెలియలేదు. సుబ్రహ్మణ్యం వెలిగిస్తానని శ్రీస్వామివారితో చెప్పాడేగాని వెంటనే ఆ పని చేయలేదు. ఆ రూపాయి జేబులో వేసుకొని దేవాలయానికి వెళ్ళాడు. అక్కడ పదిరూపాయల నోటుకు చిల్లర తెమ్మన్న

తులశమ్మగారికి ఆ రూపాయిచ్చి అప్పటికి వాడుకోమన్నాడు. ఆ సాయంత్రం శ్రీస్వామివారు అతణ్ణి "కర్పూరం వెలిగించావా?" అని అడిగారు. "వెలిగించానని" అతడు జవాబిచ్చాడు, కాని నిజానికి వెలిగించలేదు. తులశమ్మ ఖర్చు పెట్టింది కూడా దేవునికేగా అని తలచాడు. మూడు నెలలు గడిచాయి.

ఒకనాటి రాత్రి అతని స్వప్నంలో పెద్ద కర్పూరం గడ్డ మండుతూ బ్రహ్మాండమైన జ్వాల కనిపించింది. అది చూచి అతడు నిద్రలోంచి భయపడి లేచి ఏమిటా? అని ఆలోచించసాగాడు. ఆనాడు శ్రీస్వామివారు చెప్పిన పని చేయని ఫలితమే ఇదని గుర్తించి వెంటనే ఉన్న పళంగా లేచి ప్రయాణమై తిరువళ్ళూరు వెళ్ళి, చెంపలేసుకొని, కర్పూరం వెలిగించి క్షమాపణ వేడాడు.

112 **సద్గురువు కృప జూపినా వారి సలహా యందు పూర్ణ విశ్వాసం లేనివారు ఫలితం పొందజాలరని వేలూరు సుబ్రహ్మణ్యంగారి అనుభవాలు సూచిస్తున్నవి.**

వేలూరు సుబ్రహ్మణ్యంగారు తన అనుభవాల్ని ఇలా చెప్పారు.

1970వ సం॥లో నేను, నా భార్య శ్రీస్వామివారి ఆశీస్సులు తీసుకొని గొలగమూడి నుండి ఇంటికి వెళ్ళేందుకు బస్సు దగ్గర ఉన్నాము. ఆ కరుణాసముద్రుడు మా వద్దకు వచ్చి "అయ్యా! నీకు కనకమంటి కాలమొస్తుంది. నీకు చీటి వ్రాసి ఇచ్చినా నీవు గుర్తెరుగలేవు. నేను నీకా స్థలం చూపించాలి. తలుపూరులో ఎగవ వాళ్ళ ఇంటికి పడమరగా ఉంది. ఆ ఇల్లు కూడా నేను చెపితే నీ పరమవుతుంది. నీవక్కడే కాపురముండు" అని చెప్పారు. ఆ విధంగా కాపురం మార్చడం నాకు ఇష్టం లేదు. కానీ శ్రీ స్వామివారు చెప్పారు గనుక "సరే రండి స్వామి, ఆ స్థలం చూపించండి" అన్నానే కానీ మనసులో మాత్రం ఈ పిచ్చి వెంకయ్యతో కూడా తిరుగుచున్నానని తలుపూరులో మా బంధువులు నవ్వుకుంటారని మనసులో తలచాను. వెంటనే ఆ సర్వజ్ఞమూర్తి నా మనసులోని మాట గుర్తించి "అయ్యా! పిచ్చి వెంకయ్య మీదనే చెప్పు. నాకేమీ ఫరవాలేదు" అని చెప్పి బస్సులో నాతో నెల్లూరు వచ్చారు. మేము తలుపూరు బస్సు ఎక్కి కూర్చున్నాము. కానీ కొద్ది సేపటిలో నా బుద్ధి మారింది. తలుపూరు వెళ్ళి నవ్వుల పాలవడం ఇష్టం లేక "స్వామీ మీరు ముదిగేడు పోండి, నేను మా బంధువులింటికి వెళ్ళి వస్తాను" అని చెప్పి బస్సు దిగిపోతున్నాను.

వెంటనే ఆ మహానుభావుని ముఖారవిందము లక్షలు నష్టపోయిన

వానికి వలె దీనాతి దీనంగా మారింది. "అయ్యా! నేను నీకోసం వస్తే, నీవు నామాట వినకుండా పోతున్నావే. నీకు అన్నం చేసి పెట్టే ఆమెకు ఎడమ కాలుకు గడ్డ వచ్చేటట్లు ఉంది. మద్రాసు ఆసుపత్రికి పోవలసి వస్తుంది. నీవు నెల్లూరు రంగనాయకుల దేవస్థానంలో పావలా ఇచ్చి ప్రసాదపు అన్నం కొని మూడు పూటలు ఆమెకు పెట్టించు, కొంత జబ్బు తగ్గిస్తారు" అని సెలవిచ్చారు. రెండు నెలలకు ముందు ఆపదను తెల్పి నివారణ కూడా చెప్పారు.

శ్రీస్వామివారి మాట యందు శ్రద్ధ లేని నేను మా వంటామెకు ఒక్కపూట మాత్రమే ప్రసాదం పెట్టించి వెళ్ళిపోయాను. శ్రీస్వామివారు చెప్పినట్లే అటు తర్వాత రెండు నెలలకు ఆమె తొడ మీద గడ్డలేచింది. మద్రాసుకు తీసుకువెళ్ళి ఆపరేషన్ చేయిస్తే ఐదు వందల రూపాయలు ఖర్చు అయినది. ఆ రోజు శ్రీస్వామివారి మాట పాటించనందుకు తగిన శాస్తి జరిగింది. తలుపూరుకు కాపురం మార్చి ఉండినట్లయితే సిరిసంపదలతో సుఖంగా ఉండెడి వాడను. కానీ వారి మాట వినలేదు గనుక ఇలా ఉన్నాను".

ఒక రోజు ఈ భక్తుడే తన పొలంలో నీరు ఎక్కడ పడుతుందో చెప్పితే బావి త్రవ్వుకుంటానని శ్రీస్వామివారిని అడిగాడు. శ్రీస్వామివారు పొలంలో నాలుగు వైపులా తిరిగి, **"అయ్యా! ఈ చేలో నీళ్ళు లేవు ఈ ప్రక్కనున్న అర ఎకరాలో ఎనభై నాలుగు ఎకరాలకు సరిపడు నీరున్నది. ఈ అర ఎకరా కొని బావి త్రవ్వించు. ఇందులో బావి త్రవ్వినవారు ఎప్పుడూ నీడన జీవిస్తారు".** అని చెపుతూ బావి త్రవ్వవలసిన చోట గుర్తు కూడా పెట్టారు. 'ఈ పొలం నీవు ఎట్టి పరిస్థితిలోను అమ్మవద్ద'ని చెప్పారు. కానీ ఏమి లాభం. వారి మాట వినకుండా అమ్మేశాను. ఇప్పుడచ్చట బావి త్రవ్వినవారు లక్షాధికారులైయున్నారు. (భవిష్య నిర్ణయం - ఎవరనేది నిర్ణయం లేదు. ఎవరు కొంటే వారికి. ఇది ఒక చిత్రమైన విధి నిర్ణయం కాదా?) 113

కాటంరెడ్డి సుబ్బారెడ్డి (కల్లూరుపల్లి) ఇలా చెపుతున్నారు. మాకు వున్న 22 ఎకరాల మెట్ట అమ్మదలచి శ్రీస్వామివారిని అడిగాను. "రాబోయే రోజులలో అది లక్షల విలువ చేస్తుంది. నీకు ఏమి శనిబట్టి అమ్ముచున్నావయ్యా" అన్నారు శ్రీస్వామివారు. మా నాన్నకు నిజము చెప్పకుండా బుకాయించి ఎకరా రూ. 500/- చొప్పున అమ్మివేశాను. ఇప్పుడు అది ఎకరా ఒక లక్షరూపాయలు విలువ చేస్తుంది.

మరొకప్పుడు నాకున్న మాగాణిని మార్పు చేయదలచి శ్రీస్వామివారిని అడిగాను. "అయ్యా, మాగాణి అమ్మితే నానా అగచాట్లుపడుతాడని చెప్పినా వినడు. కర్మఫలం చాలా బలంగా వుంది. ఏమి చేస్తాము" అని శెలవిచ్చారు. (వినడని కూడా శ్రీస్వామివారికి తెలుసు). శ్రీస్వామివారి మాట వినకుండా పొలము మార్పు చేశాక మూడు సంవత్సరములు పంటలు పండక 20 వేల రూపాయలు అప్పు చేయడమేగాక జీవితంలో ఎన్నడూ అనుభవించనంత మానసిక బాధను అనుభవించాను. శ్రీస్వామివారి కృపవలన 10 వేల రూపాయలు ఇచ్చి మరలా నా పొలము నేను మార్పు చేసుకున్నాను. అది మొదలు నా ఆర్థిక, మానసిక పరిస్థితులు చక్కబడి సుఖపడ్డాను. ఈ పొలము మార్పిడి కేవలము శ్రీస్వామివారి కృపవలన జరిగినదేగాని నా తెలివితేటల వల్లకాదు. మా నాన్నపై శ్రీస్వామివారికి గల ప్రేమ వలన నా పొలము నాకు వచ్చేటట్లు కృప చూపారు.



శ్రీ స్వామివారి సమాధి